క్లుప్తంగా

ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణ అందిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

చండూరు: ప్రాథమిక స్థాయిలో విద్యాభ్యాసం చేసే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలని రిసోర్స్ పర్సన్స్ ఉదావత్ లచ్చిరామ్, వేముల సైదులు అన్నారు. సోమవారం చండూరు హైస్కూల్‌లో తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎడ్ల భిక్షం, రాపోలు లక్ష్మీనారాయణ, రిసోర్స్ పర్సన్స్ వడ్డగాని సాయిరాం, అండ్లపురి శ్యాంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనగల్ ఎస్‌ఐగా రామకృష్ణ



కనగల్ : కనగల్ మండల ఎస్‌ఐగా బి. రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న నర్రా అంతిరెడ్డి వీఆర్‌కు ఎటాచ్ అయ్యారు. రామకృష్ణ స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ కనగల్‌కు బదిలీపై వచ్చారు. అంతకుముందు కేతేపల్లి, నార్కట్‌పల్లిలో ఎస్‌ఐగా పనిచేశారు. కాగా ఎస్‌ఐ అంతిరెడ్డిపై ఎలాంటి అభియోగాలు లేకున్నా వీఆర్‌కు అటాచ్ చేయడంతో మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీసు సిబ్బంది ఆశ్చర్యానికి గురవుతున్నారు.

రిజర్వేషన్ల సమాచారం ఇవ్వాలని వినతి


వినతి పత్రాన్ని అందజేస్తున్న నరేష్, విజయ్

కనగల్ : గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ల సమాచారం కోరుతూ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు గౌని నరేష్, కేవీఆర్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు పోలే విజయ్‌కుమార్ సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అల్తాఫ్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. గతంలో ఉన్న రిజర్వేషన్లను కేటాయిస్తారా.. లేక మార్చే అవకాశం ఉందా అని వినతిలో వారు పేర్కొన్నారు.

పౌష్టికాహారం, దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

నల్లగొండ టూటౌన్: మినీ క్రిస్మస్ వేడుకలను సోమవారం నల్లగొండలో నేస్తం సొసైటీ, జీవితాశ కౌన్సిలింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి సుధాకర్ హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 150 మందికి పౌష్టికాహారంతోపాటు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మమత, హర్ష్య బేగం, హరీశ్, సిస్టర్ రోస్, వెంకన్న, చామంతి, సైదులు, కవిత, శ్రీను పాల్గొన్నారు.

పంప్‌హౌజ్, పార్క్ పరిశీలన


పార్కులో ఆట వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్: పానగల్‌లోని మున్సిపాలిటీకి చెందిన పంప్‌హౌజ్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పంప్‌హౌజ్‌లోని మోటార్లు, నీటి సరఫరా, సంప్ తదితర వాటిని పరిశీలించి స్థానిక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రాంనగర్‌లోని వైఎస్సార్ పార్కును పరిశీలించారు. పార్కుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.


హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శిస్తున్న చాడ కిషన్‌రెడ్డి

బెల్టు దుకాణాలు మూతపడేనా!

- మునుగోడు నియోజకవర్గంలో పూర్తిగా మూసివేయిస్తానని ఎమ్మెల్యే హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

మునుగోడు: ప్రభుత్వం మండలానికి మూడు, నాలుగు మద్యం దుకాణాలు మంజూరు చేసి వాటి ద్వారా మద్యం విక్రయాలకు అనుమతి ఇచ్చింది. కానీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి గ్రామంలో దాదాపు నాలుగైదు బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయంలో తప్ప మిగతా రోజుల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. దీంతో అనేకమంది యువకులు మద్యానికి బానిసలై ఏ పనిచేయకుండా నిత్యం తాగుతూ ఇళ్ల వద్ద ఉంటున్నారు.

గ్రామాల్లో అధికమవుతున్న గొడవలు..

ప్రతి గ్రామంలో మద్యం విక్రయాలు కొనసాగుతుండడంతో ప్రజలు ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా మద్యం తాగుతున్నారు. అనేక మంది కేవలం మద్యం కోసం నెలకు దాదాపు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మద్యం



సేవించినవారు చిన్నాచితకా విషయాలకు తగవులు పడుతున్నారు. కొందరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకొని స్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. అయితే పేదరిక నిర్మూలన చేయాలంటే సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2018వ సంవత్సరంలో గెలుపొందిన ఏడాదికే ఆలోచించారు. ఆ సమయంలో ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే కాకపోవడంతో అధికారులు సహకరించలేదు. దీంతో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుచేసే గ్రామ పంచాయతీకి రూ. 5 లక్షల నజరాన అందిస్తానని రాజగోపాల్‌రెడ్డి ప్రకటించారు. స్పందించిన కొందరు సర్పంచ్‌లు తమ గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయించారు. ఆ సమయంలో రాజగోపాల్‌రెడ్డి నాలుగైదు గ్రామాలకు రూ.5 లక్షల నజరానా తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా అందజేశారు.

ఈ నెల 10న హామీ ఇచ్చిన ఎమ్మెల్యే..

రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్‌రెడ్డి ఈ నెల 10వ తేదీన మునుగోడు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టనున్న పనులతోపాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలను వెంటనే మూసివేయిస్తానని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దీంతో నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు మూసివేయిస్తారా లేదా అనే చర్చ ప్రతి గ్రామంలో జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే నిర్ణయంపై గ్రామాల్లో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే బెల్టు దుకాణాలను మూసి వేయించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే నిర్ణయం హర్షణీయం



గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయిస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రకటించడం హర్షణీయం. ప్రతి గ్రామంలో దాదాపు ఐదు బెల్టు దుకా ణాల ద్వారా మద్యం విక్రయిస్తున్నారు. బెల్టు దుకాణాల వల్ల గ్రామాల్లో అనేక తగవులు జరుగుతున్నాయి. బెల్టు దుకాణాలు మూసివేయిస్తే తగవులు తగ్గిపోవడంతోపాటు పేదరిక నిర్మూలన జరుగుతుంది.

– బొడ్డు శ్రావణి, మునుగోడు ఎంపీటీసీ

ప్రతిఒక్కరూ సహకరించాలి



గ్రామాల్లో మద్యపాన నిషేధం అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఉండడం వల్ల యువత మద్యానికి బానిసవుతున్నారు. యువత మేలుకోసం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బెల్టు దుకాణాలను నిషేధించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆయన నిర్ణయానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలికి వెంటనే బెల్టు దుకాణాలను మూసివేయించాలి.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్

మూడు, నాలుగు రోజుల్లో మూసివేయిస్తాం

మా సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న బెల్టు దుకాణాలను మూడు, నాలుగు రోజుల్లో మూసివేయిస్తాం. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గత ఆదివారం నాకు ఫోన్‌చేసి బెల్టు దుకాణాలను మూసివేయించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలను వెంటనే అమలు చేసేందుకు మా సిబ్బందికి ఇప్పటికే తగు సూచనలు జారీ చేశాం. బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మల్లయ్య, ఎక్సైజ్ సీఐ, చండూరు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య సేవల పోస్టర్‌ను సోమవారం నకిరేకల్‌లోని 100 పడకల వైద్యశాలలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఆ తరువాత అందరం ఒక్కటే అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని చెప్పారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేయాలి కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే రెండు రోజుల్లో రెండు స్కీంలను అమలు చేశామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ తో పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల కష్టాలు తీరిపోనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పూజర్ల శంభయ్య, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి ఎంపీపీలు బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, జెల్లా ముత్తిలింగం, పెరుమాళ్ల శేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ సేవల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, నేతి విద్యాసాగర్

జెండా దిమ్మె ఆవిష్కరణ

నకిరేకల్ మున్సిపల్ కేంద్రంలోని 100 పడకల వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన ఐఎన్‌టీయూసీ 3194 వైద్యశాఖ యూనియన్ దిమ్మెను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షం, ప్రతినిధులు విశ్వనాథుల నర్సింహాచారి, కరుణాకర్‌రెడ్డి, రామకృష్ణ, శ్యాంసుందర్, రవీందర్, వరికుప్పల శ్రీనివాస్, రవి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

నార్కట్‌పల్లి : చెర్వుగట్టులోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ అధికారులు, అర్చకులు సోమవారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఎమ్మెల్యేను సన్మానించి, ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయంలో భక్తుల సమస్యలు, అభివృద్ధి వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఆలయానికి విచ్చేసి పరిశీలించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు పోతుల పాటి రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సురేష్‌శర్మ, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, మాజీ చైర్మన్లు పున్నపురాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, గాడుసు శశిధర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, వరాల రమేష్, రేగట్టె నర్సిరెడ్డి, శంకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సన్మానిస్తున్న అర్చకులు, అధికారులు

హైవే అధికారులకు మున్సిపల్ కమిషనర్ లేఖ

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాలనీల్లోకి వెళ్లే రోడ్ల వద్ద సమాంతరంగా కొంత దూరం రోడ్డు నిర్మాణం చేపట్టాలని నేషనల్ హైవే అధికారులకు మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు లేఖ రాశారు. సోమవారం 'సాక్షి ' లో వచ్చిన 'ఇష్టారాజ్యంగా రోడ్ల నిర్మాణం' అనే కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. పట్టణంలోని డీవీకే రోడ్డు, పానగల్ ప్రాంతాల్లో నేషనల్ హైవే రోడ్డును ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న విషయం తెలిసిందే.

సాక్షి ఎఫెక్ట్..


సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డిని సన్మానిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కవి రాములు మృతికి సంతాపం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం నర్సింగ్‌భట్ల గ్రామానికి చెందిన ప్రముఖ కవి రచయిత బి.రాములు ఆదివారం మృతి చెందారు. రాములు మృతికి నల్లగొండ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య, కవులు కొలనుపాక మురళీధర్ రావు, అలుగుబెల్లి రామచంద్రారెడ్డి, చకిలం కొండల నాగేశ్వరరావు, డాక్టర్ బండారు సుజాతశేఖర్ లు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రాములు అభ్యుదయ భావాలు కలిగిన కవి అన్నారు. మోదుగు పూలు, జెండా కర్రలు, ఊర్లు ఉరుకుతున్నాయి, శిరసెత్తిన వంటి అనేక రచనలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారన్నారు.

డీసీఎం బోల్తా

మర్రిగూడ: పత్తి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం సోమవారం యరగండ్లపల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ తనకు రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు మండలానికి చెందిన నీల మహేష్ వాపోయాడు. ప్రమాదం నుంచి డ్రైవర్ బయటపడడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

భిక్షంరెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన పబ్బతిరెడ్డి భిక్షంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. భిక్షంరెడ్డి మృతదేహాన్ని సోమవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూతి సత్యశ్రీ వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ ఏర్పుల నర్సింహ, తెల్బూరి సైదులు, యాదగిరి, వెంకటేష్, లింగయ్య, మహేష్, రాకేష్, శంకరయ్యలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా


నినాదాలు చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటంలో రైతు సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా నాయకులు మాట్లాడుతూ చట్టాల రద్దు కోసం 13 నెలలపాటు సాగిన పోరాటంలో అనేకమంది రైతు సంఘాల నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇచ్చిన హామీ మేరకు అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందాల ప్రమీల, కున్‌రెడ్డి నాగిరెడ్డి, గురిజా రామచంద్రయ్య, వీరవెల్లి వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం, వస్కుల మట్టయ్య, జక్కల నర్సింహ, కుంభం కృష్ణారెడ్డి, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, దండెంపల్లి సరోజ, మన్నె భిక్షం, కుడుతాల భూపాల్, వస్కుల సైదమ్మ, డి.మోహన్, పి.కాశీ, బైరు సత్తయ్య, పాండరయ్య పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

కేతేపల్లి: మండలంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకంలో ప్రయోజనం లేకుండా పోతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తూ సూర్యాపేట, నల్లగొండ పట్టణాల మధ్య నిరంతరం బస్సులు నడపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, కోట లింగయ్య, లరపాక రాజు, సీహెచ్.నాగయ్య, వి.సొడయ్య, చెరుకు సత్తయ్య, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.


ఆర్ఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి

నల్లగొండ టౌన్: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తరించి సామాజిక సేవా కార్యక్రమాలను పెంచాల్సిన అవసరం ఉందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ మట్టమనేని బాబురావు అన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన లయన్స్ క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా ఉచితంగా అల్పాహారం అందించడం హర్షణీయమన్నారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వివిధ రకాల జబ్బులతో ఇబ్బందులు పడేవారికి చేయూతనివ్వాలన్నారు. అనంతరం క్లబ్‌కు విరాళాలు అందించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ మోహన్‌రావు, శివప్రసాద్, గోలి అమరేందర్‌రెడ్డి, భీమయ్య, గోపాల్‌రావు, దశరథ, సత్యనారాయణ, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, మోహన్, వెంకన్న, రేణుక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబురావు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో భజనలు చేస్తున్న భక్తులు


కట్టంగూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పట్టణంలోని ప్రధాన ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి పెరిగింది. పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయం భక్తులతో రద్దీగా మారింది. శివుడిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో అభిషేకం చేశారు.

కార్తీక పూజలు

కట్టంగూర్ : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా కట్టంగూర్ మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శివ కోటి స్తూపలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి తులసీ దళాలు, బిల్వ దళాలు అర్పించారు. రుద్ర హోమం, సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాస శర్మ, ఇల్లెందుల కృష్ణమూర్తి మనెమ్మ, కడవేరు మల్లికార్జున్‌కృష్ణవేణి, కోమటి భాస్కర్‌పారిజాత, ఓరుగంటి హరిబాబు, రమేష్, కాపుగొంటి గోపి, ఇందిరమ్మ, కల్పన పాల్గొన్నారు.


పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు

మంత్రి కోమటిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ–ముశంపల్లి–ధర్మపురం రోడ్డును 4 లేన్ల రోడ్డుగా విస్తరిస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించడంతో సోమవారం ముశంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గ్రామ శివాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రోడ్డు విస్తరణ జరిగి, కోమటిరెడ్డి మంత్రి కావాలని గతంలో ఎంపీటీసీ బీరం స్వాతికరుణాకర్‌రెడ్డి శివాలయంలో మొక్కారు. కోరిక నెరవేరడంతో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. నల్లగొండ నుంచి ధర్మాపురం వరకు 18 కిమీ రోడ్డు 4 లేన్లుగా విస్తరిస్తుందని అనుకోలేదని, కేవలం డబుల్ రోడ్డుగా విస్తరిస్తే సరిపోతుందని ఆకాంక్షించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నల్ల గొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, సర్పంచ్ బైరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నల్లగొండ టౌన్ : మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు ఇవ్వాల్సిన ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ వచ్చినప్పటికీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఏజెన్సీలకు నూతన టెండర్లు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వి.లింగయ్య, కె.స్వర్ణ, విజయ, మమత, లక్ష్మి, అన్నపూర్ణ, మంగమ్మ, అండాలు, కరుణ, కనకమహాలక్ష్మి, చంద్రమ్మ, కవిత, విజయమ్మ పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గడ్డి దగ్ధం

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లిలో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు సోమవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డిని ట్రాక్టర్ నుంచి రోడ్డుపై విడిచి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. గడ్డిని ఎక్కడికి తరలిస్తున్నారనేది తెలియరాలేదు.

మాలధారులకు అన్నదానం

చౌటుప్పల్ : పట్టణంలోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయంతో పాటు శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయంలో సోమవారం పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా అన్నదానం చేశారు. దేవాలయాల కమిటీ అధ్యక్షులు, మాలధారులు, దాతలు, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సంస్థాన్‌నారాయణపురం : మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన నిరుపేద ముద్దం రామక్క సోమవారం మృతి చెందింది. దీంతో గ్రామ సర్పంచ్ దోనూరు జైపాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలి

దేవరకొండ: దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీనాయకులు సోమవారం నల్లగొండ కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ.. దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన పాలన అందుతుందని అన్నారు. చిత్రియాల, చెర్కుపల్లి, పడ్మట్‌పల్లి, గొడకొండ్ల గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీరెల్లి చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, పోతెపాక సాంబయ్య, నరేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్‌యాదవ్, పగిళ్ల సాగర్, బోడ శ్రీశైలం, వనం జగదీశ్వర్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

నల్లగొండ టౌన్ : అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ సిరికొండ రమేష్ జ్ఞాపకార్థం రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాంబాబు, సేవా సమితి సభ్యులు భీమనపల్లి శ్రీకాంత్, గణేశ్, చిన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ గుడిలో 'కల్పతరువు'


టబ్బుల్లో ఏర్పాటు చేసిన దుస్తులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ పరిధిలో గల గాంధీ గుడిలో 'కల్ప తరువు' కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాంధీ గుడి ఆవరణలోని ధాన్య మందిరం సమీపంలో ఉపయోగించడానికి వీలుగా ఉన్న దుస్తులతోపాటు ఇతర వస్తు సామగ్రిని గుడి నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎవరైనా తమకు అవసరం లేని దుస్తులను, ఇతర పాత వస్తువులను వదిలేసి అక్కడే ఉన్న తమకు అవసరమున్న ఇతర వస్తువులను నిరభ్యంతరంగా తీసుకెళ్లవచ్చు.